క్లుప్తంగా

ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు యాదవుల మద్దతు



పోతునూరులో వైఎస్సార్ సీపీకి మద్దతు ప్రకటిస్తున్న యాదవులు

దెందులూరు: ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌కు యాదవులు మద్దతు ప్రకటించారు. బుధవారం టీటీడీ బోర్డు మెంబర్, దెందులూరు నియోజకవర్గ పరిశీలకుడు నెరుసు నాగసత్యం దెందులూరు మండలంలో దెందులూరు, కొవ్వలి, ఉండ్రాజవరం, పోతునూరులో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా యాదవులు సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌కు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నెరుసు నాగసత్యం మాట్లాడుతూ త్వరలో కొవ్వలిలో యాదవులతో భారీ సమావేశం నిర్వహిస్తామన్నారు. యాదవుల సంఘీభావం, మద్దతును అభ్యర్థుల సమక్షంలో ప్రకటిస్తామన్నారు. ఆయన వెంట పార్టీ దెందులూరు మండల ఉపాధ్యక్షుడు తలారి రామకృష్ణ, దెందులూరు సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, కొవ్వలి ఎంపీటీసీ గౌరిపర్తి వరలక్ష్మి రంగారావు, పోతునూరు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బత్రాజు సత్యనారాయణ, దెందులూరు, కొవ్వలి, పోతునూరు గ్రామాల్లో యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి పీఠాధిపతి జయరావు ఆశీస్సులు

దెందులూరు: ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి ఆశీస్సులు అందజేశారు. బుధవారం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పీఠాధిపతి జయరావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గురుత్వ పట్టాభిషేక ఉత్సవం నిర్వహించడం అందులో తాను పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని పీఠాధిపతి జయరావుతో ఎమ్మెల్యే అన్నారు.

వైభవంగా అమ్మవార్ల జాతర

గణపవరం: అర్ధవరం గ్రామ ప్రజల ఆరాధ్య దేవతలు కట్లమ్మ, నూకాలమ్మవార్ల జాతర మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా బుధవారం ఉదయం అమ్మవార్లను గ్రామస్తులు దర్శించుకుని పూజలు చేశారు. జాతర సందర్భంగా బుధవారం రాత్రి అమ్మవారి గవళ్ల గుడుపు సేవ వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలు మూడు రోజులు నిర్వహిస్తారు. ప్రతిరోజు ఆలయం వద్ద అమ్మవార్లకు సేవ నిర్వహిస్తారు.

కోదండరామ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

దెందులూరు: సోమవరప్పాడు పంచాయతీ కొత్తూరులో బుధవారం కోదండరామ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండల వైస్‌ప్రెసిడెంట్ వేమూరి జితేంద్ర కుమార్, సర్పంచ్ సరిగే నాగరాజు, మాజీ సొసైటీ చైర్మన్ మేకా సాంబశివరావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఫాదర్ బాలకు సత్కారం

దెందులూరు: ఆర్‌సీఎం పీఠం ఏలూరు వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ పీ.బాలను బుధవారం సోమవరప్పాడులోని సెయింట్ జాన్స్ విద్యా సంస్థల్లో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ సత్కరించారు. ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేసి వికార్ జనరల్ ఫాదర్ బాలను సత్కరించారు. ఆయన నుంచి ఆశీస్సులు పొందారు. అనంతరం ఫాదర్ బాల ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

6వ తేదీ నుంచి వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు

గణపవరం: ఈ నెల 6వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ 1నుంచి 9వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయినట్టు గణపవరం ఎంఈవో-1 పుచ్చల శేషు తెలిపారు. జల్లికొమ్మర యూపీ స్కూల్లో బుధవారం ఆకస్మిక తనిఖీలో భాగంగా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను ఎంఈవో పరీక్షించారు. అనంతరం ఉపాధ్యాయులకు సమావేశమై పలు అంశాలను వివరించారు. విద్యాసంవత్సరం ఆఖరి రోజు ఈనెల 23న ప్రతి పాఠశాలలో హెచ్‌ఎంలు తల్లిదండ్రుల సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రగతి పత్రాలు అందించాలన్నారు. అదేరోజు విద్యాశాఖ ఛానల్ ద్వారా పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సందేశాన్ని తల్లిదండ్రులకు వినిపించాలన్నారు. హెచ్‌ఎం సుందరకుమార్, సౌజన్య, ప్రసాదరావు తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య

ఉంగుటూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటలతో విద్యార్థులకు గుణాత్మక విద్యనందిస్తున్నట్టు ఉప్పాకపాడు ఫ్లస్ పాఠశాల హెచ్‌ఎం నక్కా సుధాకర్ తెలిపారు. బుధవారం ఆ గ్రామంలో పర్యటించి ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 18 మంది పిల్లలు ఉండగా 12 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. టీచర్లు అల్లు శ్రీను, పి.శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్త జాన్సీ, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతల అవస్థ

- సచివాలయాల వద్ద మండుటెండలో పింఛన్‌దారుల పడిగాపులు
- మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ



భీమడోలు: పోలసానిపల్లి వద్ద ఉదయాన్నే వేచి ఉన్న వృద్ధులు, వితంతువులు

భీమడోలు: ఐదేళ్ల తర్వాత పాత రోజులు మళ్లీ దర్శనమిచ్చాయి. అవ్వా తాతలు, వితంతులు బుధవారం ఉదయాన్నే సచివాలయాల వద్దకు చేరుకుని పింఛన్ల నగదు కోసం వేచి చూశారు. ప్రభుత్వం బుధవారం మధ్యాహ్నం నుంచి పింఛన్లు సచివాలయాల వద్ద పంపిణీ చేస్తామని చెప్పడంతో లబ్ధిదారులు ఆతృతతో ఉదయం 9 గంటలకే అక్కడికి చేరుకున్నారు. కొన్ని చోట్ల మధ్యాహ్నం నుంచి ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా పింఛన్లు పంపిణీ చేశారు. అన్ని సచివాలయాల వద్ద షామియానాలు వేశారు. వలంటీర్ల సేవలను తమకు దూరం చేసిన చంద్రబాబు కూటమిపై పింఛన్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఒకటో తేదీన పింఛన్ల నగదును ఇంటింటికీ వలంటీర్ల ద్వారా అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనను మరువలేమమని వారన్నారు. పనులు మానుకుని రావాల్సి వస్తోందని, గతంలో ఇంటికి వచ్చి పింఛన్ల సొమ్ము ఇచ్చే వారని దీని వల్ల ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు వాపోయారు.

పింఛన్ల పంపిణీ 68 శాతమే

పెదపాడు: చంద్రబాబు నిర్వాకంతో ఈనెల 1వ తేదీన అందాల్సిన పింఛన్లు ఆలస్యమవడంతో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి దాపురించిందని లబ్ధిదారులు వాపోయారు. మండలంలో వలంటీర్లు ప్రతి నెలా 1వ తేదీన 90శాతం మందికి పింఛన్లు అందించేవారు. వలంటీర్ల సేవలను ఎన్నికల కమిషన్ నిలుపుదల చేయడంతో ఇబ్బంది పడుతున్నామని పింఛన్‌దారులు అన్నారు. ఉదయం నుంచి పింఛనుదారులు సచివాలయాల వద్ద వేచి ఉన్నారు. ఇంకా పింఛను అందక దానిపైనే ఆధారపడి జీవించే వృద్ధులు, వికలాంగులు అల్లాడిపోయారు. మండలంలోని మూడో తేదీ రాత్రి సమయానికి కేవలం 69శాతం మాత్రమే పింఛన్లు అందించారు.



పెదపాడు: పింఛనుదారుల పడిగాపులు

పెన్షన్ల పంపిణీ

దెందులూరు: గ్రామాల్లోని సచివాలయాల్లో బుధవారం పెన్షన్ల పంపిణీ చేశారు. దివ్యాంగులు, దీర్ఘకాలిక బాధితులు, అంధుల ఇళ్ల వద్దకు వెళ్లి సచివాలయ ఉద్యోగులు పెన్షన్ నగదును అందజేశారు. సానిగూడెంలో క్లెం దుర్గ, క్లెం బేబికి సచివాలయ ఉద్యోగులు ఒక్కొక్కరికి రూ.3 వేలు చొప్పున రూ.6 వేలు నగదును అందజేశారు. దివ్యాంగుల తల్లిదండ్రులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆట పాటలతో కూడిన విద్యా బోధనే లక్ష్యం

భీమడోలు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆట పాటలతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రథమ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఏలూరు జిల్లా కోఆర్డినేటర్ టి.శ్రీనివాస్ అన్నారు. గుండుగొలనులోని-23 కేంద్రం అంగన్‌వాడీ టీచర్ బోడ రాజమణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీస్కూలు చిన్నారుల విద్యా ప్రమాణాల స్థాయి, వారి స్థితిగతులపై బుధవారం ఆయన క్షేత్ర స్థాయి పరిశీలన చేసి నమోదు చేసుకున్నారు. టీచర్ బి.రాజమణిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో 87 హబ్ అంగన్‌వాడీలుగా గుర్తించారన్నారు. అందులోని విద్యాభ్యాసం చేస్తున్న పీపీ 1, పీపీ 2 చిన్నారులకు వారి స్థాయిని ఆధారంగా వారికి అవసరమైన పాఠ్యాంశాలను బోధించేందుకు అంగన్‌వాడీ సిబ్బందికి తన సంస్థ చక్కని తర్ఫీదును అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.కవిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ వేగవంతం చేయాలి



బుధవారం రాత్రి పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న ఏలూరు ఆర్డీవో, ఉంగుటూరు ఆర్వో ఎస్‌ఎస్‌కే ఖాజావలి

భీమడోలు: పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులదేనని ఏలూరు ఆర్డీవో, ఉంగుటూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్‌ఎస్‌కే ఖాజావలి అన్నారు. భీమడోలు సచివాలయం వద్ద పింఛన్ల తొలి రోజైన బుధవారం రాత్రి పింఛన్లదారులకు నగదు పంపిణీ నిర్వహణ, సంబంధిత ఏర్పాట్లపై ఆయన పరిశీలించారు. నగదు పంపిణీకి సంబంధించిన వివరాలు సంబంధిత అధికారుల నుంచి ఆయన అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలను ఆర్వో సంబంధిత అధికారులకు సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా సచివాలయాల వద్ద మంచి నీరు, షామియానాలను ఏర్పాటు చేశామని ఆర్వోకు సిబ్బంది తెలిపారు. భీమడోలు సచివాలయానికి రూ.21లక్షలు జమ కాగా వాటిలో రాత్రి వరకు 55 శాతం నగదును సచివాలయానికి వచ్చిన లబ్ధిదారులకు అందించామని ఎంపీడీవో టి.స్వర్ణలత వివరించారు. మండల వ్యాప్తంగా 9,165 మందికి వివిధ రకాల పింఛన్లకు సంబంధించి రూ.2.74 కోట్లకు రూ.2 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. దీనితో 50 శాతం మందికి ఇప్పటి వరకు పంపిణీ చేశామన్నారు. మండలంలోని 17 సచివాలయాలకు పూళ్ల 2, 3, దుద్దేపూడి సచివాలయాలకు మినహా అన్ని సచివాలయాల్లో పంపిణీ వేగవంతమైందన్నారు. గుండుగొలను సచివాలయం- 3లో 78 శాతం పూర్తయ్యిందన్నారు. మంచంపై ఉన్న వారు, విభిన్న ప్రతిభావంతులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు సచివాలయ సిబ్బందితో అందిస్తామని అధికారులు వివరించారు. ఆర్వో ఎస్‌ఎస్‌కే ఖాజావలి మాట్లాడుతూ ప్రభుత్వం ఈనెల 6వ తేదీలోగా పింఛన్లు నగదు పంపిణీ పూర్తి చేయాలని అన్నారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ, తహసీల్దార్ జి.వరహాలయ్య, గ్రామ కార్యదర్శి ఎస్.ఠాగూర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విస్తృతంగా 'మేమంతా సిద్ధం'



పెరుగ్గూడెంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తదితరులు

దెందులూరు: రాబోయే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌కు వేసి ఘన విజయం అందించాలని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని కోరారు. బుధవారం పెరుగ్గూడెంలో సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి) ఆధ్వర్యంలో మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా ప్రచారం చేశారు. తొలుత ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో అమలైన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా కామిరెడ్డి నాని మాట్లాడుతూ మరింత అభివృద్ధి, సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీని బలపరచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ యలమర్తి బాపూజీ, గ్రామపార్టీ అధ్యక్షుడు యలమర్తి సత్తిబాబు తదితరులున్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం

ఉంగుటూరు: వైఎస్సార్ సీపీకి భారీ మెజారిటీ అందించాలని కోరుతూ ఉంగుటూరు మండలం వైఎస్సార్ సీపీ నాయకులు గోపినాథపట్నంలో ముమ్మరంగా ప్రచారం చేశారు. బుధవారం నిర్వహించిన ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల వాసుబాబు సోదరుడు చిన్నబాబు పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఆ గ్రామ సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి, పాతూరి శ్రీనివాసరాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీని గెలిపించాలని గోపినాథపట్నంలో ప్రచారం చేస్తున్న నాయకులు

నేను సిద్ధం మాఊరు సిద్ధం

పెదపాడు: ప్రజలు సంక్షేమం అందించాలంటే ముఖ్యమంత్రిగా జగనే ఉండాలని పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ తెలిపారు. పెదపాడు మండలంలోని నాయుడుగూడెం గ్రామ శివారు ఖాజీగూడెంలో నేను సిద్ధం మాఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఘన విజయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధాబత్తిన జోజమ్మ, మారుమూడి కృపామణి, బేతాళ శేఖర్ పాల్గొన్నారు.

ఉంగుటూరులో ప్రచారం

ఉంగుటూరు: ఉంగుటూరులో వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సచివాలయాల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సందక రాంబాబు, కోరాడ శివ, కరిబోతు వెంకటేశ్వరరావు, దూసన పూడి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


అన్ని వర్గాల మేలు కోసం వైఎస్సార్‌సీపీ కృషి



పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి : అన్ని వర్గాల ప్రజల మేలు కోసం వైఎస్సార్ సీపీ కృషి చేస్తుందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం కొండలరావుపాలెం ఎమ్మెల్యే కార్యాలయానికి ఏలూరు రూరల్ మండలం ఎస్సీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరికి స్వచ్ఛందంగా మద్దతు తెలిపారు. బుధవారం ఏలూరు రూరల్ మండలానికి చెందిన ఎస్సీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో భారీ బైక్ ర్యాలీగా కొండలరావుపాలెం క్యాంపు కార్యాలయానికి వచ్చారు. జగనన్న నాయకత్వంలో, ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఏలూరు రూరల్ మండల ప్రాంత ప్రజలు గతంలో ఎన్నడూ చూడని సంక్షేమాభివృద్ధిని అందించారని వారన్నారు. వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు తొలగించి ఐక్యత తెచ్చారని వారు పేర్కొన్నారు. ఈ ప్రగతిని సుస్థిరం చేసుకోవాలన్న నిర్ణయంతో తామంతా కలిసి ఎమ్మెల్యే కొఠారును కలిసి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆయన్ను భారీ మెజారిటీతో గెలిపిస్తామని నాయకులు, కార్యకర్తలు ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఏలూరు రూరల్ మండల నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. జగనన్న ఆశీస్సులతో అందరి అభివృద్ధికి పాటుపడుతున్నానని, ఏ సమస్యలు వచ్చినా తాను పరిష్కరిస్తానని, అందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మరోసారి దెందులూరు గడ్డపై వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేద్దామని పిలుపునిచ్చారు.

వైఎస్సార్ సీపీలోకి చేరిక



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన బాలిన సాయిబాబు తదితరులు

దెందులూరు: మండలంలో టీడీపీ ఎదురుదెబ్బ తగిలింది. సీతంపేటలో టీడీపీ ప్రధాన నాయకులు బాలిన సాయిబాబు, బాలిన వెంకటరమణ, 15 టీడీపీ కుటుంబాలు బుధవారం రాత్రి ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కాసాని వెంకటేశ్వరరావు, షేక్ హవల్‌దార్, మేకల గురునాథం, బేతా బాలయ్య, గౌరుకొండ గణపతి, పంచా రాము, కోటిపల్లి సతీష్, బేతా ముఖేష్, కొటికల పవన్, మహేష్ వైఎస్సార్ సీపీలో చేరారు. అనంతరం కొఠారు రామచంద్రరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ విజయానికి అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత కనకరాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, ఉదయ్‌భాస్కర్, రాజేష్, రాజు, ఎంపీటీసీ పులవర్తి వరమణి, సంతోష్, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), నాయకులు, కార్యకర్తలు గ్రామంలో పథకాలపై ప్రచారం నిర్వహించారు.

కొల్లేరు రైతులపై బైండోవర్ ఎత్తి వెయ్యాలి

నిడమర్రు: కొల్లేరు రైతులపై అటవీశాఖ, రెవెన్యూ అధికారులు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివెయ్యాలని నిడమర్రు పరిధిలో కొల్లేరు రైతులు బుధవారం నిడమర్రు తాహసీల్దారు కార్యాలయం వద్ద కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. నిడమర్రు 5వ కాంటూరు పరిధిలో సంప్రదాయ వ్యసాయం చేసుకునేందుకు అనుమతి ఇచ్చిన అటవీశాఖ అధికారులు చేలకు గట్లు వేసుకుంటుంటే అడ్డుపడి బైండోవర్ కేసులు నమోదు చేయడం అన్యాయమని రైతు మండా పోలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. 5వ కాంటూరు పరిధిలోని మా భూములు ఏళ్ల తరబడి సాగు లేక నిరుపయోగంగా ఉన్నాయని, రైతుల కోరికపై డీఎఫ్‌ఓ వ్యవసాయానికి అనుమతి ఇచ్చారని అన్నారు. చెరువులు తవ్వుతున్నారని ఫిర్యాదులు వచ్చాయంటూ నోటీసులు ఇవ్వడం దారుణమని రైతులు అన్నారు. అనంతరం తాహసీల్దారుకు వినతిపత్రం అందించారు.

నాడు- నేడు పనులు వేగంగా పూర్తి చేయాలి



పెదపాడులో ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎస్‌ఏ అడిషనల్ కో ఆర్డినేటర్ సోమశేఖర్

పెదపాడు: పెదపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఎడిషనల్ కో ఆర్డినేటర్ వీ సోమశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉపాధ్యాయులతో మాట్లాడుతూ మండలంలోని నాడు-నేడు పథకంలో వివిధ అంశాలకు సంబంధించి పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. ఇప్పటి వరకు జమ అయిన సొమ్మును ఖర్చు చేయాలన్నారు. ఎస్-2 పరీక్షలకు విద్యార్థులను సమాయత్తం చేయాలన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మధ్యాహ్నం భోజనంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రానున్న విద్యా సంవత్సరానికి విద్యాకానుక కిట్లు రానున్నాయని వాటిని ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు ఈనెల 23న చివరి పనిదినం కావడంతో ఆరోజుకు నాడు-నేడు పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఎంఈఓ నర్సింహమూర్తి మాట్లాడుతూ ఈనెల 10, 12 తేదీల్లో టోఫెల్ పరీక్షలు నిర్వహించే పాఠశాలల్లో ఓఎంఆర్ పద్ధతిలో విద్యార్థులకు నేర్పించాలని సూచించారు. పరీక్షను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని చెప్పారు. నాడు-నేడు ఏఈ పీ శ్రీనివాస్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నాడు- నేడు పనుల ప్రగతిపై సమీక్ష

దెందులూరు: మండలంలో నాడు- నేడు మన బడి పనులు వేగవంతం కావాలని ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని దెందులూరు మండల విద్యాశాఖాధికారులు ఏవీఎస్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ కోరారు. బుధవారం ఎంఈఓలతో, హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంఈఓ అన్నమ్మ మాట్లాడుతూ పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నాడు- నేడు పనులు షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ. 92 వేలు పట్టివేత

దెందులూరు: మండలంలో జాతీయ రహదారిపై సోమవరప్పాడు వద్ద బుధవారం తనిఖీ చేస్తున్న దెందులూరు ఎస్సై కే.స్వామి ద్విచక్ర వాహనదారుడి నుంచి రూ. 92 వేలు నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. కామవరపుకోట నుంచి ఏలూరు వస్తున్న సత్యనారాయణ వాహనాన్ని తనిఖీ చేయగా ఎటువంటి ఆధారాలు లేని నగదును సీజ్ చేసి ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు.

20 కుట్టుమెషీన్లు పంపిణీ

దెందులూరు: ఆర్‌సీఎం ఏలూరు పీఠం అధిపతి పొలిమేర జయరావు 32వ గురుత్వ పట్టాభిషేకం సందర్భంగా దెందులూరు పరిసర ప్రాంతాల్లోని ఉచితంగా శిక్షణ పూర్తి చేసిన 32 మందికి కుట్టు మెషీన్లు పంపిణీ చేసినట్టు దెందులూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జీ. అమ్మన్‌రాజా అన్నారు. బుధవారం దెందులూరు చర్చిలో కుట్టుమెషీన్లు అందజేశారు. మహిళలు ఫాదర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

చంద్రబాబుకు మతి భ్రమించింది

- పేదల పొట్ట కొడతామంటే చూస్తూ ఊరుకోం
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



వట్లూరులో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: చంద్రబాబు కాలం చెల్లిన నాయకుడని, ప్రస్తుతం ఆయన మతి భ్రమించి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు.పెదపాడు మండలంలోని వట్లూరులో నేను సిద్ధం మాఊరు సిద్ధం కార్యక్రమం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ఆళ్ల సతీష్‌చౌదరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొఠారు మాట్లాడుతూ పేదలను ఇబ్బందులకు గురిచేస్తూ, వారి పొట్ట కొడతామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తొలుత ఆర్‌సీఎం చర్చిలో చర్చిఫాదర్ అబ్బయ్యచౌదరిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ఉదయానే పింఛన్లు అందిస్తున్న వలంటీర్లపై ప్రతిపక్షాలు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. గ్రామాల్లో ప్రజలు అన్నీ గమనిస్తున్నారని కొద్దిరోజుల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. చంద్రబాబు దుర్బుద్ధి కారణంగా ఎందరో పింఛన్‌దారులు కార్యాలయాల వద్ద పడిగాపులు కాచి ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. కూటమికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. పచ్చ బ్యాచ్ రకరకాల వేషాలు వేస్తూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని చెప్పారు. ప్రజలు వారి మాయ మాటలు నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ చంద్రబాబు పెత్తందార్లకు, కార్పొరేట్ వర్గాలకు మాత్రమే అండగా నిలబడతారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షాన నిలబడే వ్యక్తి కొనియాడారు. ప్రజలంతా ముఖ్యమంత్రిగా మరలా జగన్ మోహన్‌రెడ్డినే కోరుకుంటున్నారని చెప్పారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, స్థానిక ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు స్థానిక సర్పంచ్ గుజ్జుల రత్నకుమారి, ఎంపీటీసీ త్సవలం కనకదుర్గ, ఉపసర్పంచ్ చింతా మధుసూధనరావు, గుజ్జుల నవీన్ పాల్గొన్నారు.